# ముంబి(కో) రోజు

వి.బి.బి. రామారావు



రత్తయ్య రథం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆగింది. దోవ పొడుగునా ఉత్తరు వాసనలు వెదజల్లి, పాయిలు సరుకుల నాణ్యత గుబాళింప చేస్తూ, సైకిలు దిగి, అరుగుకు జేరవేసి, కానిస్టేబుల్ సింహాచలం వంక హోచిరునవ్వు విసిరాడు రత్తయ్య.

“సి. ఐ. గారున్నారా?”

“ఉన్నారు.”

అందరికీ రత్తయ్య అయినా సింహాచలానికి మాత్రం అతను రత్తిగాడే. రత్తిగాడు రత్తయ్యగా మారి పోవడం సింహాచలానికి వింతగా, ఎబ్బెట్టుగా ఉంటుంది. అతని దృష్టిలో అత నెప్పుడూ బొగ్గుల రత్తిగాడే. ఆడపాదడపా స్టేషనుకొచ్చి కేసులిప్పడెప్పి, కేడిగాళ్ళ వైనాలూ, డి.జి. భోగట్టాలూ మాటల్లో దంగరించి అందిస్తూ చాటుగా ‘దొర’ గారికి పెట్టులూ. బుడ్లూ సరఫరా చేస్తూ రత్తిగాడు రత్తయ్యలయిపోయాడు.

అతని ‘షెపు’ ముందు వో పెద్దకాటా ధర్మానికి ప్రతీకలా సాక్షాత్కరిస్తుంది. కేజీ ముప్పావలా కమ్ముతాడు అసలు సిసలు చింత కర్ర బొగ్గు.

“నమస్కారం సార్! దరిసెనాల్లేవ్! డబ్బుకేటి అడిగినిక్కోండా? దాన్ని సపం కొన్నావా? మాట నిలుపుకోవాల. మీకాన్నాలపిన పెట్టి కెళ్ళిపోండి!” డబ్బు అడిగినోళ్ళని ఆప్యాయంగా పలకరిస్తాడు.

“నాబోటోళ్ళ వంశతులు. .ఆఁ. .ఆఁ. ఏనాగేటి. . మరి ఆడేటి వాతోటంగ నెప్పాడు? దొంగనాయాల! నువ్ నాతో ఈ సంగతి చెప్పలేని ఆడి దొంయిర్యం. . —పోనాఁవేటి?” వాడి భావంలో వాళ్ళతో మాటాడాలని రత్తిగాడి ప్రయత్నం.

“సి కెందుకూ, నువ్వూ ఏదో తేజారుస్కుంటూ. ఆడికి సునక సీకట్లో రెండు లాగితే ఆడే తిన్న గుంటాడు. ఆడితో నువ్వే టనకు. నా కొదిలేయ్.”

ఇలా వచ్చేపోయే వాళ్ళను పలకరించి, మాటల్లో తేనెచిలకరించి, సుతారంగా సలహాలిచ్చి, వాళ్ళ దగ్గర మామూళ్లు లాగి, సేకరణ కేంద్రం దగ్గర రకరకాలు సేకరించి, కంటికింపుగా ఎక్కడనారికింత ఆబద్ధాలు గుండ కలిపి, పోలకేంద్రాల్లో సీసాల కెత్తిపెట్టి, పోలీస్ స్టేషన్‌కు ఆడపదడపా వెళ్ళి తనకు తోచిన ‘సేవ’ చెయ్యడం రత్తయ్య అలవాటు.

వూళ్లో ఎక్కడ తగువైనా, ముందో వెనకో దానితో రత్తయ్యకి సంబంధం ఉండక తప్పదు. ఆ పక్షానైనా, ఈ పక్షానైనా అతని దగ్గరకు న్యాయానికి రావడం—పెద్దమనిషిగా అతన్ని పెట్టుకోవడం, సరుకూ, సరంజామా, మందీ, మార్బలంతో రత్తయ్య సన్నాహం చేసుకుని తీర్పులివ్వడం, ఆ తరవాత అవసరమైతే అరులు చెయ్యడం పరిపాటి.

“రత్తిగాడొచ్చాడు, ఇక పనయినట్టే!”

మనసులో విసుక్కుని, ద్వారం దగ్గర బ్రహ్మానందంగారి పిలుపు అందే దూరంలో నిలుచున్నాడు సింహాచలం.

## 2

“బాబొచ్చేసరికి ఇంకా గంటౌదతాది.” బెంయినీ కుర్రాడు చెప్పాడు సింహాచలానికి.

“ఏటి సంగతి?”—ఉద్యోగంలో చేరి పదేళ్ళయింది. ఆ మాత్రం తెల్సుకోకపోతే పోలీసు ఉద్యోగం సాధ్యమా?

“ఇంటికొచ్చేసరికి రాత్రి రెండైపోనాది. ఆ యమ్మగారు అంతదాకా మేల్కొనే ఉన్నారు. . ఏటో పాపం, మాలచ్మి—ఇల్లాలు.”

అంతకంటే సింహాచలంతోనైనా సరే మరేం అనడానికి ధైర్యం లేకపోయింది ఆ కుర్రాడికి.

ఇన్‌స్పెక్టర్ బ్రహ్మానందం సంగతి సింహాచలానికి తెలియనిది కాదు. ఇటు ప్రొహిబిషనూ (ఉన్న రోజుల్లో), అటు ఐ.టి. యాక్టూ అమలు చేస్తూ ఉప్పునాకారం తిన్న మనిషిగా కాలు జారకుండా ఉండడం అసాధ్యం. ఒకసారి వూబిలోకి కాలు జారాక బయటకు రావడమూ అసాధ్యమే.

“అదేమిటమ్మా, బావుగోరు కరెట్టు మనిషి. ఈ సంసారం లేదా ఉంటే ఒప్పుకోరండి. పట్టు రెక్కుః!” అంటూ ఉండేవాడు అమ్మగారితోడ సింహాచలం, అయ్యగారింటి దగ్గర డ్యూటీ చేస్తున్న రోజుల్లో.

అతనికి ఆ రోజుల్లో ఉద్యోగం కొత్త. అయ్యగారంటే దేవుడని నమ్మకం. చేతి కొసుక లేకుండా పదీ పాతికా తీసి ఇస్తుంటే సింహాచలం అతనికి నమ్మిన బంటులా ఉండేవాడు.

చుట్టూ విషయం సింహాచలానికి విశదంగా అవగాహనకు వచ్చేసరికి పదేళ్ళ ‘సర్వీసూ’ అయి పోయింది. ముగ్గురు పిల్లలకీ తండ్రీ అయ్యాడు.

బ్రహ్మానందంగారు చేసే ప్రతిపనీ సింహాచలానికి తెలిసినా దానిలోనుంచి చెడ్డల్ని పరీక్షించడం తన పని కాదనుకునేవాడు.

ఇంటి డ్యూటీ నుంచి తనని పంపేస్తున్నప్పుడు అమ్మగారు ‘సింహాచలం, నీ భార్యనోకసారి తీసుకురా’ అన్నారు.

అయ్యగారు ‘నీ ఆడదానికి చీరా అదీ కొను’’ అంటూ వొ వంద ఇచ్చారు.

“బాబూ, ఇంతా!?” నీళ్ళు నమిలాడు సింహాచలం.

“ఓరి, పాతిక్కీ, పరక్కీ ఏం వస్తుంది—ఉంచేస్!” అన్నారు.

కొత్త చీర కట్టుకుని అప్పాయమ్మ అమ్మగారింటి కెళ్ళింది. “అబ్బ! లక్ష్మీదేవిలా ఉన్నావ్!” అని బ్రహ్మానందంగారి భార్య మురిసి పోయింది.

అప్పాయమ్మ చెప్పిన తర్వాత కాని బాగా తెలియ లేదు ఆ యమ్మగారు పొగొట్టుకున్నదేమిటో.

“మావా! నువ్ నాకు సీరల్లూ తేవద్దు. నగలూ సేయించొద్దు. పినా అయ్యగారిలా కాకుండా నావోడిగాఉంటే అంతే సేన! నవన్నేయం సెయకు!” అని గుండె మీద తల పెట్టి తన గుండె లయ వింటూ జుట్టు నిమురుతూ గోముగా తన కళ్ళల్లోకి చూస్తున్న అప్పాయమ్మను వింతగా చూశాడు సింహాచలం.

“ఆ అయ్యగారికి దూరంగుంటే మంచిదేటో!”

గుండెలోని ఆరాటం చల్లార్చుకుందికి అంది అప్పాయమ్మ ఆత్రంగా.

“పోన్లేవో! నాకన్నీ తెల్సు. నా జాగరత నాకుండాల గాని, నువ్ సెప్పేదేటి!” అంటూ గర్వంగా, తృప్తిగా, హాయిగా దగ్గరగా తీసుకున్నాడు భార్యని.

“అయ్యగారు సెడిపోతన్నారని ఆయమ్మ గుండె తరుక్కుపోతంది!”

"అళ్ళకి సెడిపోటమేటి, ముట్టుకున్నదంతా బంగారమే!"

"నీకు బోధపడదు, మావాఁ! మన కలాంటి డబ్బొద్దు!"

"నీకు కావాల్సినా, అది నావెల్ల కాదే!" విట్టూర్చాడు సింహాచలం.

సింహాచలం అంటే బ్రహ్మానందంగారికి కొంత 'ఇది' ఉంది. అందుకే అతనికి అన్నీ పనులూ చెప్పడు. అతను తేరిపార చూస్తే కళ్ళు తిప్పుకుంటాడు. కొన్ని కొన్ని సమయాల్లో అతన్ని తన దరిదాపుల్లో లేకుండా ఎక్కడికో పంపించేవోడు.

ఆలోచిస్తూ వరండా మీద అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు సింహాచలం.

## 3

ఏటెన్షన్‌కొచ్చి బూటునేలమీదకొట్టి సెల్యూట్ చేశాడు సింహాచలం ఎస్. ఐ.గారు మెట్లెక్కగానే. ఆయన లోపలకు వెళ్ళి కూచుని 'సింహాచలం' అని పిలిచాడు. అదే సింహాచలాని గర్వకారణం. తనొక్కడినే నంబురు పెట్టి పిలవకుండా పేరుతో పిలుస్తారు. ఆయనకు కాఫీ, సిగరెట్లు తెచ్చి ఇచ్చేసి బయట పచార్లు చేస్తున్నాడు. మరి కాసేపట్లో లోపలకు వెళ్ళి విషయం వరంగాచెబుదామని ఆలోచిస్తున్నాడు.

ఇంతటిలోకి వచ్చేశాడు రత్తిగాడు. రావడమేమిటి సి. ఐ. గారి దగ్గరకు వెళ్ళిపోయాడు. ఇక తను ఎస్సై గారికి చెప్పేం లాభం?

ద్వారానికి దగ్గరగా వెళ్ళాడు సింహాచలం.

"అళ్ళ సొగసడిగిపోవాల! మన సంగతి తెల్దా ళ్ళకి. ఇయ్యాల తేలిపోవాల అటో ఇటో—మనకి ఎదురాడి ఎక్కడి కెలతారు దొంగనాయాల్లు!"

ఏదేదో చెప్పేస్తున్నాడు. సింహాచలానికి రక్తం వేడెక్కి పోయింది.

"మావాఁ నువ్ ఓసన్‌లోనే ఉంటావ్! నువ్ సెయవేకపోతే అల్లగతేటి? ఆపదలో ఉన్నోళ్ళని ఆదుకోడం కాదేటి నీ ఉజ్జోగం?"

"నిజవేనే! అమాయకుల్నిరచ్చించడం ధరమవే—కాని నా ఉజ్జోగం పైవోళ్ళు సెప్పిందిసెయ్యడవేనే!"

అంతకంటే సింహాచలం మరేం అనదలచుకోలేదు. కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుందని అతనికీ తెలుసు.

## 4

"డబ్బు తెచ్చినవేటే?"

నరసమ్మ వంక ఓరకంట చూస్తూ చుట్టకు దారప్పోగు చుడతున్నాడు నారాయుడు. అతనికి మామూలు చుట్టలు రుచించవ్! 'నా సేత్తో సుట్టుకోవాల! కాలుసుకోవాల!' అంటాడు.

నరసమ్మ ఒట్టి చేతులతో రాకుండా ఓ అర శేరు పాలు తీసుకొచ్చింది.

"లేదు, బాబూ, సరకాయించుకోనేక పోనాం. ఆ మాట సెప్పడానికి నన్నంపినాడు, సత్తెయ్య."

గోడమీద ఓ బ్రాకెట్ మీద, ఏడు కొండలవాడి పటం దగ్గర, సిమ్మెలో నూనెదీపం వెలుగుతూంది. పతి వంక చూస్తూ చెప్పింది నరసమ్మ.

"ఓసి నా కెరికేనే ఆడెందు కంపించాడో—గదిలోపలెట్టు ఆ బిడ్డి!"

చిలకాకుపచ్చ చీర బిగువులోంచి చిలకలే కన పడుతున్నాయి నారాయుడికి. మైమరిచి పోయి చుట్టేస్తున్న మాలు వుటుక్కున తెగిపోయింది.

"దీన్నిపాడరగ!" కసురుకున్నాడు.

తల దించుకుని లోపలకు వెళ్ళి పాలబిడ్డి పెట్టి వస్తుంటే నారాయుడు నరసమ్మ కొంగు పట్టుకున్నాడు.

"ఒదులు. నువ్ మంచోడివని దయిర్యం సేసి లోప కొచ్చినాను. సెల్లెల్లాంటి దాన్ని.నన్నొదుల."

"సెల్లె లేటె, పింగినాదం. రాయే. ఆడితో విన్నవే సెప్పినాను, ఇక ఆగనని. విన్నంపించినాడు. ఇప్పుడు డబ్బు గొడ వెందుకునే. డబ్బు పాపిష్టి దన్నారు" దగ్గరగా లాక్కో బోయాడు.

పెనుగు లాడింది నరసమ్మ. రవిక చిరిగి పోయింది. కరవబోతున్న పళ్ళను నారాయుడు తెలివిగా తప్పించు కున్నాడు.ఆరడుగుల మనిషి దగ్గర అయిదడుగులున్న పద్దెనిమిదేళ్ళ పిల్ల గావు కేకలు పెడుతూంది. ఆబోతులా విజృంభించాడు మగరాజు. ఆడకూతురు



కింద పడిపోయింది.

గోడ మీద బల్లి నోట పురుగు గిజగిజ లాడి పోతూంది. ఆవేశంలోని ఆబోతు మీద కొస్తూంది.

ఘటం కింద పడకుండా కాసుకుంటున్న పూనకం వచ్చిన ముత్తైదువులా నరసమ్మ వూగి పోతూంది కోపంతో. ఆయాస పడుతూ నారాయుడు మొలతాడు తెంపేశాడు.

ఒక్క క్షణం వూపిరి బిగ పట్టింది ఆడ కూతురు.

"అలా దారికి రాయే." నారాయుడు రొప్పు తున్నాడు.

పూనకం వచ్చేసింది నరసమ్మకి. తనేం చేస్తూందీ తెలియలేదు. ఆమె చేసిన పనికి నారాయుడు కెవ్వన కేక వేసి పక్కకి పడిపోయాడు.

తను చేసిన పని తనకే రోతనిపించింది నరసమ్మకి. చప్పున లేచి వత్తి మీద చెయ్యి కాల్చుకుంది. నొప్పిలోంచి పూర్తిగా కోలుకోకపోయినా ఆవేశంతో రెచ్చి పోయిన నారాయుడు మళ్ళీమీద కొస్తున్నాడు.

గోడ మీద పురుగుకు ఆత్మరక్షణకి అవకాశమే లేదు. కాని నరసమ్మ దేవుడి దగ్గర వెలుగుతున్న దీపపు సెమ్మె ఉపయోగించిండి. సెమ్మె మళ్ళీ ఎక్కడ తగిలిందో నారాయుడు విలవిల లాడిపోయాడు.

దీపంలోని వత్తి కింద పడిపోయింది.

పరిగెత్తుకుంటూ నరసమ్మ సింహాచలం ఇంటికె వెళ్ళింది.

## 5

"ఏటి, నారాయుడూ,! అలాపోర్లి సెల్లిపోతన్నావ్—కడుపు నొప్పే?"

"ఆడి నెత్తురు కళ్ళ జూస్తా. ఏసేరి సీన్ని యూపారం—గరావాగా అయిదొంథలా పుచ్చుకుని ఆర్నెల్లయినా తీర్సక. . . ఆడి పంగత్తే శ్రైస్తా."

లేవబోయిన నారాయుడు కిందకు ఒరిగి పోయాడు 'అమ్మోయ్' అంటూ. పొత్తి కడుపు కింద నరాలా బట్ట పిండేసినట్టు తిరిగి పోతున్నాయి. యమలోకం కళ్ళ ముందు కనపడుతూంది.

బాగా రెండు గంట లైతే కాని కాలూ చెయ్యీ కూడదీసుకో లేకపోయాడు. మూలుగుతూ లేచి రెండొందలు జేబులో పెట్టుకుని రత్తయ్య కోసం బయలుదేరాడు.

"ఎనిమిదయిందొ హెహాయ్. పనుల్లోకి రండి." అంటూ జనపనార మిల్లు సైరను కూత పెట్టింది.

## 6

"రత్తయ్య రానేదట్రా?"

కొట్టు తెరిచిన చిహ్నంగా తడిక ఎత్తి పెట్టి ఉంది. బెంచీ బల్ల రోడ్డు మీద వడేసి కొట్టు తుడుస్తున్నాడు కుర్రాడు.

"రా, గీ అనకు." కుర్రాడు చెప్పుతున్నాడు.

'రత్తయ్య తరిఫీదు మరి' నారాయుడు గొణుక్కున్నాడు. 'ఈడితో నా కేటె' అనుకుని ఆలోచనలో పడ్డాడు.

ఆ గుంట అంతనాగ సెయి సేసుకుంటుం దనుకో నేదు. ఆ సూపూ, ఆ ఒయ్యారవూ ఏటో అనుకున్నాను. ఓరకంట సూసి కులికితే నిజమే నను కున్నాను. అయినా డబ్బు తీసుకున్నెదవ తీర సమూలేక, కావోలిసిందీ ఇయ్యనేక పోతెఎలా? సెజల్లో వాదుం కడంటె పోతంది—ఓలమ్మ.

పొత్తి కడుపు కింద చెయ్యి పెట్టి తడువుకుని ఖరేల్ మని నరాలు లాగేస్తె ఉమ్మి రవ్వాడు.

సత్తెయ్య గేదెను కొనుక్కోడానికి అయి దొందలు అప్పు కోసం వచ్చినప్పుడు వెనకాలే వచ్చింది నరసమ్మ.

'ఎనాగో తీర్చుకుంటాం' అంటూ ఉంటే నారాయుడు కళ్ళు తిప్పుకో లేకపోయాడు.

"మనల్ని మనం ఒకల కొక లెట్టు కోకపో తెనాగే. మనకెవ్వ డిస్తాడు? బేంకు లున్నాయమక్."

"నా దగ్గరఆస్తేటుంది నారాయుడూ. బేంకోళ్ళు ఆస్తిపరులకే ఇస్తామంటారు."

"అళ్ళ ఇబ్బందు లాల్లకున్నాయ్— వే ఏస్తాలే కాని, ఒరేయ్ సత్తియ్యా, దీని పే రేట్రా?"—ఎంతోఆపేక్ష చూపించాడు నారాయుడు.

గంజినీళ్ళకీ, గొడ్ల గడ్డి పరకలకీ కష్టమై పోతున్న ఈ రోజుల్లో సత్తెయ్య అప్పు తీర్చలేక పోయాడు. అందుకే నరసమ్మ చేత డబ్బు పంపించమన్నాడు నారాయుడు.

## 7

ఎంత పన్జేసినావే—ఆడదాయివి కాదూ! ఆ దూరుకుంటాడా? ఆడికి ఆ బొగ్గుల రత్తిగాడే దన్నుకటి — మన్నేం సేసినా సెయిగల్డు" సత్తెయ్య గజగజ లాడిపోయాడు.

"బగమంతుడు లేడేటి? కాకపోతే సేపం పోర్ది, అంతేనా! అతగా డ్డబ్బిస్తే ఇచ్చినాడు.. కొంగట్టు కోడం నేయవేనేటి? ఏతిమాల్ని దాన్ని కామ, మావాఁ! కూలైనా సేసి తీర్చుకుందాం. మంచికి రోజు రాక పోదు."

కళ్ళు తుడుచుకుంటున్న వరసమ్మని గుండెకు హత్తుకున్నాడు భర్త.

## 8

"ఓరెర్రోడా! డొక్కలజూస్తే ఏటి కనపడతాది? ఏది సేసినా కాసింత ఆలోసె మండాలి. అరగ్గాడు—ఎక్కడ కొడితే అబోతు వాటి మగాడు బేర్ మనీటట్టు ఎలా ఇమ్మకుందో! పసుపు నీళ్ళతో గుడ్డ తడిపి గోసెట్టుకో— నొప్పి తీసేస్తాది—ఇక తరవోత సెయివల్సింది—డాక్టరుకాడి కెళ్ళాం—కట్లు కట్టించు కోవాల. దానికో వంద సాల్దు. మూడొందలిస్తే కట్లూ కడతాడు, కాయితవూ ఇస్తాడు. ఆడు కోర్టుకి రావాలిసొస్తే మంరొకొంద. అదెయినా మనం సెప్పబట్టే. ఒళ్ళంతా గాయాలయితే కాని అడ్ని కేసులో ఇరికించలేం— ఆదే టలా అయిపోతన్నావ్! నిజం దెబ్బలు కావురా— ఎర్రినవ్వాసీ! కట్లుండా లంతే— నే జూసుకుంటా—నా కొదిలెయ్ మిగిలింది!"

"ఏటే, ఆడది నన్ను నన్ని దెబ్బలు కొట్టిందని సెప్పుకోవాలా? ఒద్దు." నారాయడు మొరాయించాడు.

"ఒరెర్రి మొగవాఁ! ఆసనని స్పేత దెబ్బలు తిని పడుంటావా! ఆడది కొట్టిందని మనం సెబుతానేటి? అలగలగే! ఈ రాజకీయాలు నాకు సెప్పకు — సత్తిగాడు దొమ్మి సేయించినాడని నే వెళ్లి సెబుతాను—కేసు బనాయిస్తాం! డాక్టరుకాయిత మిస్తడు — ఆడి గేదెలు పోతాయ్ — ఆ గుంట నీకాడికొచ్చేస్తాది."

ఎందుకో వరసమ్మ మళ్ళీ తన దగ్గరకు వస్తుందంటే భయం అనిపించింది నారాయుడుకి.

"ఆదే టొద్దు గాని... డబ్బు..." నసిగాడు.

"ఒసీ, డబేన్నేటా ముక్కెం — మరియాదా, మానవూ అక్కర్లేదా? మాట నికార్సుక్కర్లేదా?" కళ్ళు తిప్పుతూ అడిగాడు రత్తయ్య.

అదీ నిజమే ననిపించింది నారాయుడుకి. "నన్నేటి సెయ్యమంటావ్ సెప్పు!"

"మూడొంద లొట్రా—నేను తగువు తీర్చేసి, దాన్ని నీకాడ చాకిరీకి ఒప్పించేస్తాను."

"ఓలమ్మ! అదొద్దులే!"

"మరీ అలా జడ్సి పోతావేటి? ఒప్పందం తరవాత మాపెక్క! కుక్కిన పేసులా నీ కళ్ళెదుట పడుంటాది. ఎటూ నీకు పిల్లా జెల్లా లేరు—దాని కడుపున ఒక కాయ కాస్తే — అంతా ఆ బగమంతుడి దయ!"



"ఆడి పొగ రణగాల!"

"ఆడిదా, దానిదా?"

"ఆడిదే!" గబుక్కున నోటి వెంట వచ్చేసింది—'దానిదే' అనబోయినా.

"సరే, రెండొందలు సాల్లే — ఆళ్ళందరినీ నీకాడ కంపుతాను — తీరదం ఒట్టించీ—నేనూ పక్కనుంటా—ఆళ్ళకి సపోటాకి... ఈ రోజుల్లో పోలీసోళ్ళతో పడనేం! కోరుటికెళ్ళే నాశనవే! నేయం మనకి మనవే ఎసగోసూసెక్కవాల! మన తగువులు మనవే పరిస్కారం సేస్కోవాల — పెద్దోళ్ళందరూ ఇదే సెబుతన్నారు! నీకు తెల్దేటి?"

మరి నారాయుడుకి ఆలోచించడానికి టైమివ్వలేదు రత్తయ్య. రెండొందలూ తీసుకుని 'మరి నువ్వెళ్ళిరా!" అన్నాడు.

## 9

"ఓరి నాయ్నో!' నెత్తిన పరుక్కున విరిగిన కర్ర శబ్దంతో సత్తెయ్య గావు కేక మసక చీకటి నిశ్శబ్దాన్ని చీల్చింది.

"బాబోయ్! సంపేసినారు నాయినోయ్! మావని సంపేసినారు!"

గేదెను సత్తెయ్య తోలు కొస్తూ ఉండగా వెనక గడ్డిమోపు చిట్టు తట్టూ, అందులో లీటరు డొక్కూ పట్టుకొస్తున్న వరసమ్మ గావుకేక పెట్టింది.

"ఎవుడ్రాడూ?"

పోలీసు విజిల్లు 'ఖై' 'ఖై' మన్నాయి.

ఇద్దరు దుండగులు దొరికారు. మిగిలిన వాళ్ళు మసక చీకటి నీడల్లోకి కనుమరుగైపోయారు.

కానిస్టేబుల్ సింహాచలం దొరికిపోయిన మనుష్ని స్టేషనుకు తీసుకుని వెళ్ళమని నలుగురు జవాన్లకి అప్పజెప్పి, సత్తెయ్య చుట్టూ పోగవుతున్న జనువుల్ని తప్పించుకొని ఒక రిక్షాలో సత్తెయ్యను ఆస్పత్రికి చేర్చాడు. రొప్పుతూ స్టేషన్‌కు వచ్చిన సింహాచలాన్ని చూసి జవాన్లు గుసగుస లాడుకున్నారు. 'ఎర్రోడు, సిక్కులో పడతాడు' రైటరు గొణుక్కున్నాడు.

సబ్ ఇన్‌స్పెక్టరుగారు ఫోన్‌లో మాటాడుతున్న మాటలు సింహాచలం చెవిన పడ్డాయి.

"యాక్సిడెంటని రాసుకోండి. మనిషి ప్రాణానికేం భయం లేదన్నారుగా—కాస్త జాగ్రత్తగా చూసుకోండి సార్."

ఆయన ఫోన్ పెట్టేసిన తరవాత సింహాచలం ప్రారంభించాడు.

"సార్! ఇది గోరం. ఇలాంటి దేదో జరుగుతుందని నేను ముందే తెలుసుకుని మీకు చెబుదామనుకున్నాను. ఆ రత్తిగాడు దొరగారి దగ్గర కెళ్ళి ఏ ఓటో సెప్పేసేడు. లందుకే బీటు కెడుతూ మనోళ్ళని లటు కేసి తీసు కెళ్ళాము."

"ఏమిటిదంతా, సింహాచలం?"

సత్తెయ్య నారాయుడు దగ్గర డబ్బు వాడుకోడం నారాయుడు సత్తెయ్య భార్యా వరసమ్మ మీద మనసు పడడం చేసిన లఘాయిత్యం, వరసమ్మ చేసిన పని న్నీ పూస గుచ్చినట్లు చెప్పాడు. "సత్తెయ్య బుర్ర బద్దలై పోనాది ఆ రత్తిగాడిదన్ను లేకుండా ఇది జరగదు. దొరికినోళ్ళని గట్టిగా అడిగితే నిజం మీకే తెలుద్ది. ఈ ఎదవల్ని కొట్లేసినపోతే ఆ రత్తిగాడు బరి తెగించేస్తాడు."

"కాని రత్తిగాడు. . ." లటు పక్క గది వంక చూస్తూ నసిగాడు బ్రహ్మానందం.

"తెల్సండి."

"మరేం, నీకూ తెలుసుగా. వాడి మీద ఈగ వాలనివ్వరు. వాడి మనుసుల మీద మనం కేసు పెడితే ఆయనకి గుర్రు. ఇదంతా మన కెందుకు లెద్దా?"

"క్షమించాలయ్యగారూ. మీ దగ్గర నసావులో సెబుతున్నా. మీ మాట కెదురాడోల్సినోణ్ని కాదు. ఆడవా తడవా నేయం సెయ్యకపోతే ఈ ఉజ్జోగ మెందుకు? మంచి కో రోజైనా లేకపోతే మనసుల్లా బతకలేం."

ఆవేశంగా మాట్లాడేశాడు సింహాచలం.

"నిజమే బ్రహ్మానందం! మసక చీకట్లో నడుస్తూ ప్రజల మాటల్లో విషయం చాలా వరకూ అర్థం చేసుకున్నాను. డాక్టర్‌కు ఫోన్ చేస్తాను మళ్ళీ. వాళ్ల మీద కేసు పెట్టండి?"

కర్లీ లాల్చీ, పైజామాతో లోపలకు వస్తున్న సి. ఐ. గారి మాటలు విని సంభ్రమాశ్చర్యాలతో బ్రహ్మానందం, సింహాచలం అవాక్కయి పోయారు.

ఒక క్షణంలో తేరుకుని ఎటెన్షన్‌లోకి వచ్చారు. ఆయన ఇంకా మంచోనే ఉన్నారు.

"మన అవసరాలకోసం కొంతమంది వ్యక్తులమీద వాళ్ళు ఎలాంటి వాళ్ళో తెలిసి కూడా—మనం ఆధార పడుతూ ఉంటాం. కాని దేనికైనా ఒక లిమిట్ ఉంది. వన్ ఫోర్టీవన్ చెప్పినట్టు అడపా దడపా అయినా న్యాయం చేకూర్చకపోతే మనుషులుగా కూడా మనం ఫెయిల్ అయినట్టే. ఈ రోజు చెయ్య గలిగి చెయ్యలేకపోయిన మంచి పనిని రేపయినా చెయ్యకపోతే ఎంత మంది వరసమ్మల ఉసురో తోస రగిలిన నిప్పు మనల్నందర్నీ మాడ్చేస్తుంది."

దొరగారు ఆయన గదిలోకి వెళ్ళిపోయారు, గోడనున్న కాలెండర్ వంక పరీక్షగా చూస్తూ.

"దొరికాడు రత్తిగాడు వాడే దొరలా మాటాడేస్తూ ఉంటాడు—వాడి పని పట్టాలి — హు:"

హుంకరిస్తూ దొరికిన వాళ్ళ దగ్గర వాఙ్మూలాలు తీసుకోడానికి లేచాడు బ్రహ్మానందం.

కొంతసేపటికిగాని అతనికి జ్ఞాపకం రాలేదు, అది ఆగస్టు పదకొండవ తేదీ అనీ, మరునటి రోజు దొరగారికి ప్రమోషన్ వచ్చిన తేదీ అనీ.

దొరగారు కాలెండరు వంక ఎందుకు చూశారో బ్రహ్మానందానికి అప్పుడు అర్థమైంది.

'కొందరికి మంచి రోజు ఏడాది కొకసారే వస్తుంది' అనుకున్నాడు. ✸